# పదమూడు రోజులు

## యూరప్ పర్యటన నేపథ్యంతో నవల












కొయిలాడ రామ్మోహన్ రావ్

# పదమూడు రోజులు



ఎవరో గట్టిగా అరుస్తుండటం వినబడి నడవడం ఆపి వెనక్కి తిరిగి చూసాను. అక్కడొక ముస్లిం కుటుంబం కనిపించింది. ఆరడగుల పొడవుతో భారీగా ఉన్న యువకుడొకడు ప్రక్కనే ఉన్న అందమైన యువతిపైన అరుస్తున్నాడు. అతను మాట్లాడుతున్న ఉర్దూ నాకర్థమవుతుంది. ఆ అమ్మాయి పాస్‌పోర్టులు పొరపాటున ఇంటిలో వదిలివచ్చినందుకు అతను పెద్దగా కేకలేస్తున్నాడు. చుట్టూ ఉన్న మనుషులనుగాని, ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పరిసరాలనుగాని పట్టించుకోకుండా తన ధోరణిలో తాను ఉండటం నాకెంతో విచిత్రంగా తోచింది. వారి సంభాషణను బట్టి వారు కేరళ నుండి వచ్చారని, మేము ఎంచుకున్న యూరప్ ట్రిప్‌కే వారూ వస్తున్నారని, ఆ అమ్మాయి తల్లిదండ్రులది ముంబై కావడం వల్ల కొచ్చిన్ నుండి ముంబై వచ్చి, ఇక్కడి నుంచి లండన్ బయల్దేరే పనిలో ఉన్నట్లు నాకర్థమయింది. అయితే ఆ అమ్మాయి ఎయిర్‌పోర్ట్‌కి బయల్దేరే హడావిడిలో

వాళ్ళమ్మగారి ఇంట్లో పాస్‌పోర్టులు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయిందని ఇప్పుడందరూ టెన్షన్ పడుతున్నారు. ఇంటికెళ్ళి పాస్‌పోర్ట్‌లు తెచ్చే లోపు చెక్‌ఇన్‌కి టైమయిపోతుందని అందరూ గాభరా పడుతున్నారు.

ఆ జంట పేరు అక్రమ్, నీలోఫర్. అక్రమ్ ముఖం కోపంతో కందగడ్డలా అయింది. కోపాన్ని అణుచుకునే నిమిత్తం మాట్లాడకుండా గంభీరంగా ఉండిపోయాడతను. చేసిన పొరపాటుకు నీలోఫర్ ఏడవటం మొదలుపెట్టింది. ఆమెను సముదాయిస్తూనే ఆమెతల్లి కూడా ఏడవసాగింది. ఆమె తండ్రి, బంధువులు అయోమయంలో పడి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఆ సమయంలో ఒక అందమైన యువకుడు అక్కడి గుంపులోంచి ముందుకొచ్చాడు. అతన్ని అందరూ సందీప్ అని పిలుస్తున్నారు. తనకి ఎయిర్‌పోర్ట్‌లోనూ, జెట్ ఎయిర్‌వేస్‌లోనూ తెలిసినవారున్నారని, సమస్య వాళ్ళకి చెప్పి కొంత టైమ్ ఇమ్మని కోరతానని, ప్రోబ్లమ్ సాల్వ్ చేయడానికి ప్రయత్నిస్తానని ధైర్యం చెప్పి ఎవరితోనో మొబైల్‌లో మాట్లాడాడు. ఆ తర్వాత “ఎవరయినా టూవీలర్ తెచ్చారా”? అని అడిగాడు. అదృష్టవశాత్తు నీలోఫర్ కజిన్ అహ్మద్ ముందుకొచ్చాడు. వెంటనే నీలోఫర్ తండ్రి దగ్గర ఇంటి తాళాలు తీసుకొని, అహ్మద్‌ని తీసుకొని హడావిడిగా బయల్దేరాడు, ఒకసారి వాచీ చూసుకొని. అందరూ అతని మీద ఆశలు పెట్టుకొని అక్కడే సెటిలయిపోయారు.

నేను ముందుకు కదిలాను. అప్పటికే నా భార్య శైల, నా మిత్రుడు ప్రసాద్, అతని భార్య ప్రమీల ముందుకెళ్ళిపోయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ అందాలు చూడటంలో మునిగిపోయారు. ఛత్రపతి శివాజీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ మన దేశానికే గర్వకారణం. ప్రపంచంలో 48వ, మనదేశంలో 2వ బిగ్గెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా ఇది ముద్రపడింది. దీనికి ఐదు టెర్మినల్‌లు ఉన్నాయి. 750 హెక్టార్‌లలో అంటే 1850 ఎకరాలలో ఉన్న ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి సగటున రోజుకు 780 విమానాల సంచారం ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ వారు ప్రపంచంలో ఉత్తమమైన విమానాశ్రయాలలో దీనికి మూడోస్థానం ఇచ్చారు. 2014 సంవత్సరం సెప్టెంబర్ 16న ఒక గంటలో 51 విమానాలు ఎరైవల్స్, డిపార్చర్‌లు జరగడం దీని చరిత్రలో ఒక మైలురాయిలా నిలిచింది. జి.వి.కె. ఇండస్ట్రీ లిమిటెడ్‌కు

దీని ఆధునీకరణ బాధ్యత అప్పజెప్పారు. 2014 సంవత్సరం జనవరి నెలలో టెర్మినల్ –2 ప్రారంభించబడింది. ఎంతో సుందరమైన టెర్మినల్–2 గురించి ఈనాడుతో సహా అనేక పత్రికలు వార్తలు ప్రచురించాయి. ఆ టెర్మినల్‌కే మేము వెళ్ళడం గొప్ప అదృష్టం అనుకున్నాం. ప్రపంచంలో అతి సుందరమైన, అతి ఉపయోగకరమైన, ఎయిర్‌పోర్ట్‌గా టెర్మినల్–2ను తీర్చిదిద్దారు. అత్యున్నత స్థాయిలో డిజైన్, ఆర్కిటెక్చర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునికమైన ఆపరేటింగ్ సిస్టమ్ దీని ప్రత్యేకతలు. మన హెరిటేజ్, కల్చర్‌ల మేలు కలయికను ప్రతిబింబించే ప్రయత్నము కూడా ఇక్కడ చేసారు. 'జయహే' అనే పేరుతో 3.2 కి.మీ.ల మల్టీ స్టోరీ ఆర్ట్‌వాల్, ఆకాశాన్ని అందుకుంటున్నాయా అనిపించే స్కైలైట్‌లు, దేశంలోని అన్ని మతాల, అన్ని ప్రాంతాల సంస్కృతిని ప్రతిబింబించే ఏడువేల కళాఖండాలు, నెమలి ఫించం ఆకృతిలో తెల్లని అందమైన రూఫింగ్ "మనం ఇండియాలోనే ఉన్నామా!" అనిపించేటంత సుందర ప్రదేశం అది. దాని అందాలను చూసి మేమంతా మైమరచిపోయాం. ఇంటర్నేషనల్ టిక్కెట్ ఉన్నవారికే మ్యూజియం లాంటి ఈ ఎయిర్‌పోర్టును చూసే అవకాశం ఉంది.

ఆరు నెలల క్రితం యూరప్ ట్రిప్‌కి 2015 సమ్మర్‌లో వెళ్ళితీరాలని మేము నిర్ణయించుకున్నాం. దాదాపు రెండు నెలలు నెట్ దగ్గర కూర్చుని వాటి వివరాల గురించి శోధన మొదలుపెట్టాను. మనం దేశం నుండి థామస్‌కుక్, కాక్స్ అండ్ కింగ్స్, ఎస్.ఓ.టి.సి. వంటి ప్రముఖ సంస్థలు టూర్ పేకేజ్‌లను ఆఫర్ చేస్తున్నాయి. మాకు దగ్గర్లో ఉన్న వైజాగ్‌లో థామస్‌కుక్‌కి మాత్రమే ఆథరైజ్డ్ ఆఫీసుంది. మిగిలిన రెండూ ఫ్రాంఛైజ్ మీద నడుస్తున్నాయి. అంతేకాకుండా నేనిష్టపడిన నెదర్లాండ్స్, పారిస్, స్విట్జర్లాండ్, ఇటలీ దేశాలు గల పేకేజ్ థామస్ కుక్‌లోనే ఉంది. ఏ రకంగా చూసినా థామస్‌కుక్ బెటరనిపించి, స్వయంగా ద్వారకానగర్‌లో ఉన్న వారి బ్రాంచికెళ్ళి అక్కడున్న సిరాజ్‌తో మాట్లాడాను. ఆయన ప్రీమియమ్ బడ్జెట్ టూర్ సజెస్ట్ చేసారు. 13 డేస్ 12 నైట్స్ పేకేజ్ అది ఆప్షనల్ టూర్స్‌తో కలిసి మనిషి 2 లక్షలవుతుందని తెలిసింది. అందులో నేననుకున్న దేశాలన్నీ ఉన్నాయి. దానికి సంబంధించిన ప్రింటవుట్ తీసుకొని ఇంటికొచ్చేసాను.

టూర్ ప్యాకేజీ వివరాలు ఇలా వున్నాయి. ఇద్దరికీ 1,31,955 రూ॥లు

+ 2887 యూరోలు. దీనిమీద 3.09% టాక్స్. అయితే పారిస్‌లో యూరోడిస్నీ, లిడో షో స్విట్జర్లాండ్‌లో జుంగ్‌ఫ్రా వంటి ఆప్షనల్ టూర్‌లకు అదనంగా 628 యూరోలు. డ్రైవర్‌కి లోడింగ్, అన్‌లోడింగ్ ఛార్జీల (టిప్స్) నిమిత్తం ఒక్కొక్కరికి రోజుకు 3 యూరోలు చొప్పున జంటకు 72 యూరోలు. ఈవిధంగా వైజాగ్ నుండి మాకయిన మొత్తం ఖర్చు నాలుగులక్షల ముప్ఫై వేలు. షాపింగ్‌కి పెద్దగా ఖర్చు పెట్టలేదు. ఆ ఖర్చు 300 యూరోలు అనుకుంటే అదో ఇరవై వేలు. మొత్తంమీద ఇద్దరికి నాలుగు లక్షల ఏభై వేలయింది. ముంబై నుండి, హైదరాబాద్ నుండి పేకేజ్ రేట్లు ఉన్నాయి. రెండింటికీ మనిషికి ఏడువేలు తేడా కనిపించింది. వైజాగ్ నుండి కానప్పుడు ఏదైతేనేం అని ముంబై నుండి ఫిక్స్ చేసుకున్నాం. బేలన్స్ చెల్లించడానికి, బయల్దేరడానికి నలభై అయిదు రోజుల ముందు ఏభైశాతం చెల్లించాలని, నెలముందు మొత్తం చెల్లించాలని చెప్పారు. యూరో రేటు 79 రూ॥ల నుండి 72 రూ॥లకు పడిపోవడం వల్ల నేను సిరాజ్ సలహాపై ఫిబ్రవరిలోనే మొత్తం చెల్లించడం వల్ల అనుకున్నదానికన్నా తక్కువలో అయిపోయింది. అయితే ఫిబ్రవరి నుండి యూరో రేటు నిలకడ ఉండటంతో ఆలస్యంగా డబ్బు చెల్లించిన ప్రసాద్‌కి కూడా పెద్ద నష్టమేమిరాలేదు. అయితే మొత్తం డబ్బు ముందుగా చెల్లించడం అంత మంచిదికాదని మాతో ప్రయాణించిన వారొకరు చెప్పారు. వీసాలు రాని పక్షంలో కేవలం ఇరవై ఐదు శాతమే తిరిగి ఇస్తారని, ఒక్కొక్కసారి ఇద్దరిలో ఒకరికే వీసావచ్చిన సందర్భంలో కేనిల్స్ చేసుకుంటే చాలా నష్టపోతామని చెప్పారు. (నేను వ్రాసిన రేట్లు 2015కి సంబంధించినవి. గమనించ ప్రార్ధన)

ఇంటర్నేషనల్ టూర్‌ల విషయంలో కేన్సిలేషన్ విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. ముందుగా కట్టించుకున్న రూ॥ 50,000/-లు (మనిషికి) వదులుకోవాల్సిందే. ఆ తర్వాత 59-40 రోజులకు ముందు రూ. 80,000/-లు, 39-31 రోజులు ముందు 1,25,000/-లు, 30 రోజులు ముందు మొత్తం అంతా కేన్సిలేషన్‌లో కోల్పోవలసిందే. ఐదు నెలల ముందు ఏభైవేల లెక్కన చెల్లించి, దానిమీద ఆశ వదులుకొని ఈ ఐదు నెలల్లో టూర్‌కి అడ్డంకులేమి రాకూడదనుకుంటూ ఆరోజు కోసం ఎదురుచూసాం. వాస్తవానికి మేము ఏప్రిల్ 23వ తారీఖుకు బుక్ చేసుకున్నాం. అప్పుడయితే

నెదర్లాండ్స్‌లోని టులిప్ పువ్వులు వాడిపోకుండా మంచి బ్లూమింగ్‌లో ఉంటాయని ఉద్ధేశ్యంతో. దానికి అనుగుణంగా ముంబైకి ఫ్లైన్ టిక్కెట్స్ బుక్ చేసుకున్నాం రెండు నెలల ముందుగా అంటే ఫిబ్రవరి నెలలో. అయితే ఏప్రిల్ రెండవవారంలో సిరాజ్ బాంబ్ పేల్చాడు. మా టూర్ మే నెల 4వ తారీఖుకు పోస్ట్‌పోన్ అయిందని నాకు మతి పోయింది. ముంబై ఫ్లయిట్ టిక్కెట్ కేన్సిల్ చేసుకోవాలి. మళ్ళీ బుక్ చేసుకోవాలి, ఎంత నష్టం? ఎందుకని అడిగితే గ్రూప్ ఫార్మ్ కాలేదని తప్పని పరిస్థితుల్లో అలా చేయవలసి వచ్చిందని హెడ్ ఆఫీస్ నుంచి ఇన్ఫర్మేషన్ వచ్చిందని చెప్పాడు. ఏం చేస్తాం? ఇరుక్కుపోయాం. లక్ష రూపాయలు అడ్వాన్స్ కట్టిన తర్వాత ఆఫీసులో యు.కె., యూరప్ వీసాల నిమిత్తం పాస్‌పోర్ట్‌లు సబ్మిట్ చేసినప్పుడు వారి ఆఫీసులో ఎగ్రిమెంట్ కాగితాల మీద సంతకాలు చేసాం. ఆ కాగితాలలో ఇటువంటి క్లాజ్ ఉండే ఉంటుంది, టూర్ పోస్ట్‌పోన్ చేయడానికి సమ్మతిస్తున్నట్లు. ఏం చేస్తాం? తప్పదుకదా? అయితే ఆఫీసుకెళ్ళేముందే సంతకాలు చేయవలసిన ఎగ్రిమెంట్ నెట్‌లో చదివాను. కానీ ఇలా టూర్ పోస్ట్‌పోన్ అవుతుందనే సందేహం నాకు ఏమాత్రం కలగకపోవడం వల్ల దానిమీద దృష్టిపెట్టలేదు.

మా టూర్ ప్రోగ్రామ్‌లో మొదట లండన్ తర్వాత వరుసగా నెదర్లాండ్స్, బెల్జియం, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, జర్మనీ దేశాలున్నాయి. యు.కె.కి ఒక వీసా, యూరప్ దేశాలన్నింటికీ ఒక షెంగన్ వీసా తీసుకోవాలి. వీసా ఖర్చులన్నీ పేకేజ్‌లో కలిసే వుంటాయి. అడ్వాన్స్ చెల్లించాక యు.కె.వీసా ఫారాలు, ఎంబసీకి ఒక లెటర్, షెంగన్ వీసా ఫారాలు పాస్‌పోర్ట్‌లతో సహా ఆఫీసులో సబ్‌మిట్ చేయాలి. వాటితోపాటు మూడు సంవత్సరాల ఐ.టి.రిటర్న్స్ కూడా జతచేయాలి. గైడ్‌లైన్స్ అన్నీ వాళ్ళే ఇస్తారు. ఫొటోలు కూడా సబ్మిట్ చేయాలి. కానీ మనం జతచేసిన ఫోటోలు వాళ్ళు స్వీకరించరు. యూ.కె. కాన్సులేట్‌లో అదనంగా డబ్బు వసూలు చేసి వాళ్ళే ఫొటోలు తీస్తారు. ఫారాలు, పాస్‌పోర్ట్‌లు, వైజాగ్ ఆఫీసులో అందజేసిన తర్వాత పాస్‌పోర్ట్‌లు అందినట్లు ఒక రశీదు ఇచ్చారు. దానిని భద్రంగా దాచాను. మర్నాడే మా ఫారాలు, పాస్‌పోర్ట్‌లు చేరినట్లు హైదరాబాద్ ఆఫీస్‌నుండి అనీష్ అనే వ్యక్తి ఫోన్ చేసాడు. యు.కె.వీసాకు యు.ఎస్.వీసాలా ఇంటర్వ్యూ ఉండదు. కేవలం బయోమెట్రిక్స్ పని ఉంటుంది. షెంగన్‌వీసాకు మనం వెళ్ళనవసరం లేదు.

ఫారాలు, తగిన కాగితాలు అందజేస్తే చాలు. అనీష్ నాతో మాట్లాడి యు.కె. కాన్సులేట్‌కెళ్ళే అపాయింట్‌మెంట్ డేట్స్ గురించి అడిగాడు. జనవరి నెలలో వరంగల్‌లో పెళ్ళికెళ్ళే ప్రోగ్రాం ఉంది కాబట్టి అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్ళే ఆలోచనతో డేట్ చెప్పాను. అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయింది జనవరి 27వ తారీఖుకి. ఈలోగా బ్యాంక్ స్టేట్‌మెంట్ రెడీ చేసుకోమన్నాడు అనీష్. అపాయింట్‌మెంట్ డేట్‌కి దగ్గర్లో బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకోమని, చివరి బాలెన్స్ కనీసం నాలుగు లక్షలుండేటట్లు చూడమని, ఈ ఆరునెలల్లో ట్రాన్సాక్షన్ పెద్ద మొత్తంలో ఉండేటట్లుంటే మంచిదని చెప్పాడతను. మా అబ్బాయి ప్రతీ నెల లక్ష రూపాయలు అదే ఎకౌంట్‌కి పంపిస్తాడు. కాబట్టి ఎకౌంట్ సౌండ్‌గానే వుంది. నా పెన్షన్ ఎకౌంట్‌ది కూడా ఆరు నెలల స్టేట్‌మెంట్ తీసుకున్నాను. దాని బ్యాంక్ పాస్‌బుక్ కూడా తేవాలని చెప్పాడు. అవసరమయినవన్నీ తీసుకొని ముందుగా లక్డీకాపుల్‌లో వున్న కామత్ హోటల్‌కి, రిజ్వర్‌బ్యాంక్‌కి మధ్యలో ఉన్న ఆఫీస్‌కి వెళ్ళి అనీష్‌ని కలిసాం. వెళ్ళగానే కాఫీ రప్పించి, నా పేపర్స్ అన్నీ వెరిఫై చేసాడు. కొన్ని ఫారాలమీద ఇద్దరి సంతకాలు తీసుకున్నాడు. ఆరోజు మధ్యాహ్నం 2.30 కు మా అపాయింట్‌మెంట్. ప్రక్కనే ఉన్న కామత్ హోటల్‌లో భోంచేసి రమ్మన్నాడు. ఆ తర్వాత మా ఫారాలున్న కవరొకటి అందచేసి కాన్సులేట్ పని అయిన తర్వాత మళ్ళీ ఆఫీసుకు రమ్మని చెప్పాడు. ఆటో ఎక్కించాల్సిందిగా ఒక కుర్రాడిని అప్పచెప్పాడు. ఆ కుర్రాడు యు.కె.కాన్సులేట్ ఆఫీస్ అడ్రస్ చెప్తే ఆటోవాలా సరేనన్నాడు. ఆ ఆఫీసు బంజారాహిల్స్‌లో రోడ్ నెంబర్ 7లో వుది. రోడ్ నెంబర్ 7 మొదట్లో ఇరాన్ ఎంబసీ ఉంటుంది. అక్కడి నుంచి తిన్నగా 1 కి.మీ. దూరం వెళితే కుడివైపు ఒక పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ ఉంటుంది. దాని మేడమీద యు.కె.కాన్సులేట్ ఆఫీసుంది. ఆఫీసు బోర్డు చిన్నదిగా వుంది. వెతుక్కోవడం కష్టమే. అయితే ముందుగా వివరాలు కనుక్కొని ఉండటంవల్ల సులువుగా చేరుకున్నాం. ఆటోవాడికి నేను డైరెక్షన్ ఇవ్వాల్సి వచ్చింది.

కౌంటర్లో మా పేపర్లు అందజేసాం. ముందుగా ఫొటోలు తీయించుకోమని చెప్పారు. ప్రక్కనే ఆ ఎరేంజ్‌మెంటుంది. మనిషికి నాలుగువందల రూపాయలు తీసుకొని యు.కె., షెంగన్‌వీసా ఫొటోలిచ్చాడు. యు.కె.ఫోటోలు మన పాస్‌పోర్ట్‌లలాగే వుంటాయి. షెంగన్ వీసాల్లో

తలపెద్దదిగా, భుజాలు చిన్నవిగా ఉన్నట్లున్నాయి. రెండింటికి ఒకసారే ఫొటో తీసి కంప్యూటర్ కావలిసినవిధంగా ఎడ్జస్ట్ చేసి కాపీలిస్తున్నాడు. ఒకే ఫొటో తీసి రెండింటికీ డబ్బులు తీసుకుంటున్నావని ఒకతను కేక వేయడం గమనించాను. అక్కడ కేకలేసి ప్రయోజనం లేదు. వాళ్ళు చెప్పినట్లు వినడమే. బయోమెట్రిక్స్ అయిన తర్వాత మా టోకెన్ నెంబర్ వాళ్ళు పిలిచేవరకూ వేచియున్నాం. ఆ తర్వాత కొరియర్ ఛార్జీల కొరకు ఇద్దరికీ రూ. 300లు తీసుకున్నారు. వీసా స్టేటస్ ఎప్పటికప్పుడు మెసేజ్‌ల ద్వారా పంపడానికి అదనముగా మూడొందల రూపాయలు అడిగారు. అప్పుడు నేను చెప్పాను మేము థామస్‌కుక్ ద్వారా వచ్చాము. స్టేటస్ వాళ్ళే ఫాలోఅవుతారు కదా! అని. 'ఓకె'అని కొరియర్ తీసుకోవడానికి ఒక రిసీట్ లాంటిదిచ్చారు. అది థామస్‌కుక్ ఆఫీసులో ఇస్తే వీసా పని పూర్తి అయిన తర్వాత వాళ్ళు వీసా స్టాంపింగ్ అయిన పాస్‌పోర్ట్‌లు కలెక్ట్ చేసుకొని, షెంగన్‌వీసా ప్రొసెస్ అయ్యే వరకూ వారి దగ్గరే ఉంచుకుంటారు. యు.కె.వీసా అప్రూవల్ అయిపోతే, షెంగన్‌వీసా ఒక ఫార్మాలిటీ మాత్రమేనని విన్నాను. కానీ షెంగన్‌వీసాతో చాలా తంటాలున్నాయి. ఆఖరి వరకూ షెంగన్‌వీసా రాదని, ఒక్కోసారి బయల్దేరే ముందు ఎయిర్‌పోర్ట్‌లో అందజేసిన సందర్భాలు కూడా వున్నాయని సిరాజ్ చెప్పాడు. అందుకే టైమ్ దగ్గరపడిన తర్వాత వైజాగ్ ఆఫీసును, హైదరాబాద్ ఆఫీస్‌ను బొంబార్డ్ చేయవల్సి వుంటుందని చెప్పాడు.

మూడువారాలలో యు.కె.వీసా ఎప్రూవ్ అయిందని మెయిలొచ్చింది. షెంగన్‌వీసా ప్రోసెస్ మార్చిలో చెయ్యొచ్చునని చెప్పాడు సిరాజ్. షెంగన్ వీసా కోసం తీయించుకున్న ఫోటోలు, మళ్ళీ బ్యాంక్‌స్టేట్‌మెంట్‌లు పంపాను. అనీష్ మానేసాడు. హమీద్ అనే అతను వీసా వ్యవహారాలు చూస్తున్నాడు. అతనితో టచ్‌లో ఉన్నాను. ప్రసాద్, ప్రమీల మార్చిలో యు.కె.వీసా ఇంటర్వ్యూ పూర్తి చేసారు. షెంగన్ వీసా విషయంలో కొంత జాప్యం జరిగింది. మాలాగా యు.కె.ఎంబసీలో షెంగన్‌వీసా ఫొటోలు తీసుకోకపోవడంతో మళ్ళీ ఇక్కడి నుండి ఫొటోలు తీయించుకొని పంపాల్సి వచ్చింది. నెట్‌లో ఉన్న ఇన్ఫర్మేషన్ ఆధారంగా ఫొటోలు తీయించుకున్నారు గానీ, వాళ్ళు ఏక్సెప్ట్ చేస్తారో లేదోనని చిన్న టెన్షన్. ఏప్రియల్ మూడవ వారం వచ్చేసింది. అప్పటికి మా ప్రయాణం పదిరోజులు కూడా లేదు. షెంగన్‌వీసా కబురు తెలియలేదు. మాకు టెన్షన్

మొదలయింది. హమీద్‌కి ఫోన్ చేస్తే ప్రోసెస్‌లోఉందంటాడు. ఏప్రిల్ నెలాఖరుకు రావచ్చు అంటాడు. ఏప్రియల్ ఇరవైమూడున సిరాజ్ నుంచి ఫోన్ వచ్చింది. మా ఇద్దరి వీసాలు వచ్చేసాయని ప్రసాద్‌వి ఇంకా రాలేదని.

మా వీసాలు వచ్చాయని తెలిసిన తర్వాత, ప్రసాద్ వీసాల కోసం సిరాజ్ మీద ఒత్తిడి పెంచాను. హమీద్ కూడా అలాగే అంటూ మాకు టెన్షన్ పెంచేస్తున్నాడు. ఈలోపులో మా ఫ్లైట్ డిటేల్స్, హోటల్ డిటైల్స్ అడిగాను సిరాజ్‌ని. మీది ఇరవైవేలు పేమెంట్ డ్యూ ఉంది అంటూ బాంబ్ పేల్చాడు. నాకు చిరాకేసి ఫిబ్రవరిలో మొత్తం కట్టేసానని, దానికి సంబంధించిన వివరాలు మెయిల్ చేసాను. సిరాజ్ ఒప్పుకొని ఆ విషయంలో హెడ్ ఆఫీస్ వాళ్ళతో ఫైట్ చేస్తున్నానని వెయిట్ చెయ్యమని చెప్పాడు. ఏప్రిల్ ఇరవై ఐదుకుగానీ, లండన్ వెళ్ళే ఫ్లైయిట్ టైమింగ్స్ చెప్పలేకపోయాడు సిరాజ్. టైమ్ దగ్గర పడిపోవడంతో ఎక్కువ ఫేర్‌తో ముంబైకి టిక్కెట్లు తీసుకోవలసివచ్చింది. మా వీసాలొచ్చేసాయిగాని పేమెంట్ విషయంలో క్లారిటీ రాకపోవడం వల్ల మా ఫ్లైట్ టికెట్లు రాలేదు. ప్రసాద్ వాళ్ళవి ఫ్లైట్ టిక్కెట్లు వచ్చాయిగాని వీసాలు రాలేదు. టైమ్ దగ్గర పడిపోతుంది. మేము వైజాగ్ రెండుసార్లు తిరగాల్సి వచ్చింది. వీసా చూపిస్తేనే ఫారిన్ కరెన్సీగాని, ఇంటర్నేషనల్ క్రెడిట్ కార్డుగాని తీసుకునే వీలుంది. ఆ విషయంలో ప్రసాద్‌కి ఇబ్బంది అయింది నేను లక్ష రూపాయిలిచ్చి 1380 యూరోలు తీసుకున్నాను థామస్ కుక్ ఆఫీసులోనే. చిట్ట చివరకు మే నెల రెండవ తేది శనివారం మా వీసాలు, ఫ్లైట్ టికెట్లు, హోటళ్ల వివరాలు అన్నీ వచ్చేసాయి. మర్నాడే ముంబై ప్రయాణం. మా గ్రూపులో ఇద్దరు ముగ్గురు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారని చెప్పారు. ముంబై మూడవ తారీఖు రాత్రికి చేరి, మర్నాడు తొమ్మిది గంటలకు ఎయిర్‌పోర్ట్‌కి బయల్దేరాం. మా ఫ్లయిట్ 12.55ని॥లకు.

యూరప్ ట్రావెల్ గురించి చదివిన ఇన్ఫర్మేషన్ ప్రకారం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో థామస్‌కుక్ రిప్రజెంటేటివ్ మమ్మల్ని కలిసి, బేగేజ్ చెక్‌ఇన్, ఇమ్మిగ్రేషన్ చెక్‌ఇన్ వంటి కార్యక్రమాల్లో సహాయంగా ఉంటాడని భావించాను. ముందుగా సిరాజ్‌ని అడిగితే, అదేమీ ఉండదని, ఎసిస్టెన్స్ లండన్ ఎయిర్‌పోర్ట్ నుంచే ప్రారంభమవుతుందని చెప్పాడు. ట్రావెల్ ఇన్సూరెన్స్ విషయంలో కూడా నేను చదివినట్లుగా లేదు. ట్రావెల్ ఇన్సూరెన్స్‌కి నామినీ పేరు

ప్రాయాలని చదివాను. అదేమి ఉండదని చెప్పాడు సిరాజ్. ట్రావెల్ ఇన్సూరెన్స్‌లో ఎయిర్ ట్రావెల్ సమయంలో సుస్తీ చేస్తే మెడికల్ ఖర్చులకు, 5 రోజుల వరకు హాస్పిటల్ ఖర్చులకు 15,000 యు.యస్.డాలర్ల వరకు, ఏక్సిడెంటల్ ఇన్సూరెన్స్, డెంటల్ ట్రీట్‌మెంట్, ట్రిప్ కేన్సిల్ అయితే కాంపెన్సేషన్, బేగేజి డిలేకి కాంపెన్సేషన్, లగేజి పోయినందుకు ఇలా రకరకాల ఐటమ్‌లకు ఇన్సూరెన్స్ వుంటుంది.

డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌లో చెక్‌ఇన్ చేసినట్లే ఇక్కడ కూడా లగేజ్ చెక్‌ఇన్ చేసాం. చెక్‌ఇన్ లగేజ్ మనిషికి 30 కేజీలు, హేండ్ లగేజ్ 7 కేజీలు. మేం మాత్రం తక్కువ లగేజ్ తీసుకెళ్ళాం. అయితే ఒక సమస్య వచ్చింది. థామస్ కుక్ వాళ్ళిచ్చిన గైడ్‌లైన్స్‌లో ఒక చెక్‌ఇన్ బేగేజ్, ఒక హేండ్ బేగేజ్ అనుమతిస్తారని ఉంది. మేము రెండేసి చెక్‌ఇన్ బేగ్‌లు పెట్టుకున్నాం. మోసుకెళ్ళడానికి వీలుగా ఉంటుందని. అనుమతిస్తాడో లేదోనని ఒకరిద్దరిని అడిగితే ఎవరూ సరిగ్గా చెప్పలేదు. కౌంటర్లో ఉన్నతన్ని అడిగితే అదేం ఇష్యూ కాదని అన్నాడతను. దాంతో రెండేసి బ్యాగ్‌లు చెక్‌ఇన్ చేస్తుంటే అంత తక్కువ లగేజి చూసి "ఇవేనా ఇంకా ఉన్నాయా?" అని కౌంటర్లో ఉన్నతను అడిగితే నేను, ప్రసాద్ నవ్వుకున్నాం. అతను అయోమయంగా మావైపు చూస్తే 'సారీ' చెప్పాను. చెక్‌ఇన్ దగ్గర చాలా టైమ్ ఐపోయింది. చాలా నెమ్మదిగా జరిగింది ప్రోసెస్ అంతా. లైన్‌లో ఉంటుండగానే కొందరు ఇమ్మిగ్రేషన్ ఫారాలు నింపడం కనిపించింది. వాటికోసం ఎంక్వైరీ చేస్తే ఇమ్మిగ్రేషన్ చెక్ దగ్గరే ఇస్తారని స్టాఫ్ చెప్పారు. వాళ్ళకెలా వచ్చాయో తెలియలేదు. ఆ తర్వాత హేండ్ బేగేజ్‌లతో ఇమ్మిగ్రేషన్ చెక్ దగ్గరికెళ్ళాం. ముందుగా సెక్యూరిటీ చెక్‌ఇన్ అయిన తర్వాత ఇమ్మిగ్రేషన్‌కి వెళ్ళాలి అక్కడ మగవాళ్ళకు ఒక క్యూ ఆడవాళ్ళకు ఒక క్యూ ఉంది. ఆడవాళ్ళను తనిఖీ చేసే నిమిత్తం ఒక క్లోజెడ్ సెల్ ఉంది. మగవాళ్ళను బయటే చెక్ చేస్తున్నారు. సెక్యూరిటీ చెక్‌లో వివిధ స్థలాల్లో వివిధ పద్ధతులుంటాయి. లాప్‌టాప్, మొబైల్ విడిగాను, హేండ్‌బేగ్ విడిగానూ స్కానింగ్‌కి పంపాలి మన దేశంలో. మరోచోట అన్నీ హేండ్‌బేగ్‌లోనే పెట్టేయమంటున్నారు. కోటు, జర్కిన్‌లు విప్పేసి వాటిని విడిగా స్కాన్ చేయించాలి అన్నిచోట్ల. కొన్నిచోట్ల బెల్ట్, జేబులో ఉన్న కాయిన్స్, పాస్‌పోర్ట్‌లతో సహా మొత్తం కాగితాలన్నీ స్కానింగ్ ట్రేలో వేయిస్తున్నారు. అబుదాభీలో అలా

జరిగింది. అబుదాభీ ఎయిర్‌పోర్ట్‌లో మేము షూస్ కూడా స్కానింగ్ చేయించాల్సి వచ్చింది. చాలాచోట్ల ఏంకిల్‌షూస్, గమ్‌షూస్ మాత్రమే స్కానింగ్ చేయించారు. కత్తులు, బ్లేడ్‌లు, షాంపూలు, సబ్బులు, వాటర్‌బాటిల్స్ అనుమతించరు. బాడీ స్ప్రే వంటివి 100 మి.లీ.లకే పరిమితం. సెక్యూరిటీ చెక్ పూర్తయ్యాక పాస్‌పోర్టులు, నింపిన ఇమ్మిగ్రేషన్ ఫారాలు పట్టుకొని లైన్‌లో నిలబడ్డాం. పాస్‌పోర్టులు క్షుణ్ణంగా చెక్‌చేసి స్టాంప్‌వేసి నవ్వుతూ మాకు తిరిగిచ్చేసారు. 'హేపీజర్నీ, బాన్‌వాయేజ్' లాంటివి అంటాడేమోనని ఎదురుచూసాను అటువంటిదేమిలేదు. అప్పుడు వెనక్కి చూస్తే ముస్లిం జంట హడావిడిగా సెక్యూరిటీ దగ్గరకు రావటం కనిపించింది. హేపీ అనిపించింది వాళ్ళిద్దరినీ చూడగానే. 'సందీప్ మొత్తానికి సాధించాడన్నమాట, ఘటికుడే' అనుకున్నాను.

తొమ్మిదిన్నర గంటల ప్రయాణం. డిన్నర్ రాత్రి తొమ్మిది, పది గంటలకే. విమానంలో ఫుడ్ బాగాలేకపోతే ఆకలితో చస్తాం అనుకుంటూ ఇక్కడే ఏవో స్నాక్స్ తిని బయల్దేరాలని నిర్ణయించుకున్నాం. రెస్టారెంట్‌లు గేట్ నెంబర్ 68 దగ్గరున్నాయి. మేము చేరాల్సిన గేటు 76. ముందు స్నేక్స్ కానిద్దామని ఏమున్నాయో చూడ్డానికి ఒక రౌండ్ వేసాను. ఏమున్నాయేంటి? ఏమికావాలంటే అవి ఉన్నాయి. ఎక్కువగా లిక్కర్ షాపులున్నాయి. 'షివాస్‌రీగల్ 10% ఆఫర్, చిల్డ్ బీర్ హియర్' అనే బోర్డులతో అతి ఖరీదయిన మద్యంగల అందమైన షాపులెన్నో కనిపించాయి. ఇంకా కాఫీ డే, మెక్‌డొనాల్డ్, పిజాహట్ లాంటివి వున్నాయి. ఒక ఫుడ్ స్టాల్ కనిపిస్తే రేట్లెలా ఉన్నాయోనని బోర్డ్ వైపు చూసాను. గుజరాత్ థాలీ 350/-లు అని ఒక బోర్డ్ కనిపించింది. రెండు చపాతీలు, కర్రీ, అన్నం మొదలైన ఐటమ్స్‌తో ఒక చిన్న బాక్స్ దర్శనమిచ్చింది. లెమన్ జ్యూస్ 100రూ॥లు, సమోసాలు రెండూ రెండొందలు. ఇలా కళ్ళుబైర్లు గొలిపేలాగ ఉన్నాయి రేట్లు. వేరే స్టాల్ ఏమయినా ఉందా అని రెండడుగులు ముందుకేస్తే "ముంబై స్ట్రీటు షాప్" అనే స్టాల్ కనిపించింది. పేరు అలా వుందిగాని స్టాల్ డాబుగానే వుంది. అక్కడంతా అమ్మాయిలే మంచి యూనిఫామ్ వేసుకొని నీట్‌గా మెయింటైన్ చేస్తున్నారు. ప్లేటు ఇడ్లీ, పూరి, సమోసా, కట్లెట్‌ల వంటివి రూ॥ 100/-లకు దగ్గర ఉండటంతో అక్కడే సెటిలయ్యాం. బోర్డింగ్ పాస్ తీసుకున్నామనే ధీమాతో మా గేటు

దగ్గరికి వెళ్లడాన్ని లైట్ తీసుకున్నాం. 68వ గేటుకు 76వ గేటుకు పెద్ద దూరం ఉండదులే అని ఒకవైపు, ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తుంది కదా అని మరోవైపు ధీమాపడ్డాం. ఆ రెస్టారెంట్‌లో సర్వింగు చాలా లేటయింది. ఫ్లైట్ టైమ్‌కింకా ఇరవై నిముషాలే ఉండటంతో హడావిడిగా బయల్దేరాం. 76వ గేటు దగ్గర్లోనే ఉండొచ్చు అనుకున్న మా అంచనా తల్లక్రిందులయింది. వాస్తవానికి అది చాలా దూరంలో వుంది. దాన్ని చేరడానికి నడకతోపాటూ స్టెయిర్‌కేస్‌లు, రెండు ట్రావెలెట్‌లు ఉపయోగించాల్సి వచ్చింది. నడవనవసరం లేకుండా కదిలే ప్లాట్ ఫాంని ట్రావెలెట్ అంటారు. అందరం దాదాపు పరుగెత్తినట్లు వేగంగా నడిచాం. ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ముగ్గురు మాకు ఎదురొచ్చి మమ్మల్ని మరింత తొందరపెట్టారు. గేటు దగ్గర్నుండి డైరెక్ట్‌గా విమానం లోపలికి వెళ్ళిపోయే ఏరోబ్రిడ్జ్‌ను గేటుకు కనెక్ట్ చేయడం జరిగింది. కాబట్టి విమానంలోకి నేరుగా అడుగుపెట్టాం. ఒక్కోసారి గేటునుంచి బయటకొస్తే బస్‌లో ప్లేన్‌దాకా తీసుకెళ్తే అక్కడ మెట్లెక్కి ప్లేన్‌లోకి వెళ్తాం. ఈసారి బ్రిడ్జ్ వల్ల ఆ జాప్యం కూడా జరుగలేదు.

పెద్ద జెట్ ప్లేన్‌లోకి అడుగుపెట్టగానే నా అభిప్రాయం మార్చుకోవాల్సి వచ్చింది. ఇంటర్నేషనల్ స్టాండర్స్‌లో ఉన్న ప్లేన్ అది. చాలా బాగుంది. ముందు ఫస్ట్‌క్లాస్ కనిపించింది. ఫస్ట్‌క్లాస్‌లో సీట్లు అర్ధ చంద్రాకారంలో ఉ న్న ఓపెన్‌గా ఉన్న చిన్నచిన్న కేబిన్‌లుగా విడగొట్టబడి వున్నాయి. ప్రక్క ప్రయాణికుడితో సంబంధం ఉండదు. కాళ్ళు బాగా చాచుకొని రిలాక్స్ అయి నిద్రపోయే సదుపాయం ఉంది. ఫ్లైట్ అటెండెంట్‌ల సేవ వీరికి చాలా ఎక్కువగా ఉంటుంది. తర్వాతది బిజినెస్ క్లాస్, ఎకానమీ క్లాసులాగే ఉంటుంది కానీ సీట్లు పెద్దవిగానూ, విశాలంగానూ ఉంటాయి. మూడు లేదా నాలుగు ఎకానమీ సీట్ల స్థలంలో రెండు బిజినెస్ క్లాసులుండేలా డిజైన్ చేస్తారు. ఇక్కడ వారికి లెగ్‌స్పేస్ ఎక్కువగా ఉండి కంఫర్టబుల్ ఉంటుంది. డొమెస్టిక్ ఫ్లైట్‌లలో ఎకానమీ క్లాసు చాలా ఇరుకుగా వుంటుంది. కానీ ఇక్కడ ఎకానమీ క్లాసు కూడా చాలా బాగుంది. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఈ ఇంటర్నేషనల్ ఫ్లైట్‌లో రూఫ్ బాగా ఎత్తు. లెగ్ స్పేస్ కూడా బాగానే వుంది.ఎడమవైపు మూడేసి, కుడివైపు మూడేసి, మధ్యలో నాల్గేసి చొప్పున సీట్ల అమరిక వుంది. మాకు మధ్యలో సీట్లొచ్చాయి. ప్రతీసీట్‌కి ముందు చిన్న టి.వి., ఒక హెడ్‌ఫోన్

సెట్టు అమర్చబడి వున్నాయి. అందమైన పల్చటిరగ్గుతో చిన్న పేక్ ప్రతీ సీట్లో ఉంచారు. మధ్యాహ్నం ఒంటి గంటకల్లా ప్లేన్ టేకాఫ్ అయింది. టేకాఫ్ అయ్యేముందు టి.వి.స్క్రీన్‌లలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వీడియో చూపించారు. సీట్‌బెల్ట్ పెట్టుకోమమని, టేకాఫ్ సమయంలో సీట్ ముందున్న ట్రే పైకి లిఫ్ట్ చేయాలని, సీటు పుష్‌బ్యాక్ నుంచి స్ట్రెయిట్‌గా మార్చుకోవాలని, సెల్‌ఫోన్‌లు ఇతర ఎలక్ట్రానిక్ సామాన్లను స్విచ్ఛాఫ్ చేయాలని తెలియజేసారు. ప్లేన్ ప్రమాదానికి గురి అయిన పక్షంలో ఆక్సిజన్ మాస్క్‌లు పైనుండి ఆటోమేటిక్‌గా క్రిందికొస్తాయని, వాటిని ముక్కుకు తగిలించుకొని, పిల్లలకు తగిలించాలని. ప్లేన్ సముద్రం మీద ల్యాండ్ అయ్యే పరిస్థితి వస్తే కుర్చీ అడుగున వున్న సేఫ్టీ జాకెట్ పైకి తీసి అక్కడున్న మీట సహాయంతో దానిని ఇన్‌ఫ్లేట్ చేయాలని, గాలి సరిపోకపోతే నోటితో గాలిని ఊదాలని, దానిపై ఉన్న చిన్న లైట్ ప్రమాద సమయంలో గుర్తించడానికి ఉపయోగపడుతుందని చెపుతూ, ఆ జాకెట్ ఎలా వేసుకోవాలో వీడియోలో చూపించారు. విమానంలో ఎక్కడెక్కడ ఎగ్జిట్‌లు ఉన్నాయో చూపారు. విమానంలో పవర్‌పోతే ఆటోమేటిక్ లైటింగ్ సిస్టమ్ సహాయంతో ద్వారాల వద్దకు చేరుకోవచ్చునంటూ వీడియోచూపారు.

టేకాఫ్ అయిన తర్వాత మైకులో పైలెట్ తనని తాను పరిచయం చేసుకొని, కోపైలెట్‌ని పరిచయం చేసి వెల్‌కమ్ చెప్పాడు. వారితోపాటు తొమ్మిదిమంది సిబ్బంది ఉన్నట్లు చెప్పాడు. టేకాఫ్ అయిన కాసేపటికి బెల్ట్‌లు తీసేయవచ్చునని, కంప్యూటర్, ఐపాడ్‌లాంటివి ఉపయోగించమని, సెల్‌ఫోన్‌లు ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకోమని సూచనలిచ్చాడు. మేము పుష్‌బ్యాక్ చేసుకొని రిలాక్స్ అయ్యాం. హెడ్‌ఫోన్స్ తగిలించుకొని ఎవరికినచ్చిన ప్రోగ్రాం వాళ్ళ చూసుకోవడంలో మునిగిపోయాం. టి.వి.లో చాలా రకాల ఆప్షన్‌లున్నాయి. అందులో హాలీవుడ్ సినిమాలు, బాలివుడ్ సినిమాలు, టి.వి.షోలు, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, మ్యూజిక్ ఫోల్డర్, వీటితోపాటు ప్లేన్‌కి సంబంధించిన వివరాలు, అది వెళ్ళే రూటు, వెళ్తున్న వేగం, బయట ఉష్ణోగ్రత, ఎంత ఎత్తులో ప్రయాణిస్తుంది. లండన్‌లో ఇప్పుడు టైమెంత? ఇలా చాలా వివరాలున్నాయో అందులో.

ఎయిర్‌హోస్టెస్‌లు ఓపికగా చిరునవ్వుతో నిరంతరం పనిచేస్తూనే

ఉన్నారు. పెద్ద ట్రాలీ తోసుకుంటూ వస్తూ ముందుగా చిప్స్ పేకెట్లు అందరికీ అందజేసి డ్రింక్స్ ఏమికావాలో అడిగి సర్వ్ చేసారు. కొందరు కాఫీ, టీలు తాగితే మేము ఫ్రూట్ జ్యూస్‌లు తాగాం. సగానికిపైగా ప్రయాణీకులు హాట్‌డ్రింక్స్ తాగారు. వోడ్కా, వైన్, విస్కీ బ్రాందీ, బీర్, షాంపైన్ ఇలా చాలా రకాలు అందుబాటులో వున్నాయి. కొంతమంది ప్లేన్ చివరిలో వున్న కౌంటర్ దగ్గరికెళ్ళి మళ్ళీమళ్ళీ తాగారు. అక్కడే చిన్న టాయిలెట్ ఉంది. నాలాంటి వాళ్ళు సులువుగానే లోపలికెళ్ళి వస్తున్నారుగానీ భారీకాయం ఉన్నవాళ్ళకి ఇబ్బందే. అక్కడ ఫ్లష్ సిస్టమ్ పూర్తిగా భిన్నంగా వుంటుంది. మన టాయిలెట్లలాగా సైఫన్ సిస్టమ్ ఉండదు. వాక్యూమ్ సక్షన్ సిస్టమ్ ఉంటుంది. బటన్ నొక్కగానే వాక్యూమ్ స్విచ్ ఆన్ అయి పెద్దశబ్దంతో కమోడ్‌లో ఉన్నవాటిని లోపలికి లాక్కుంటుంది. కొద్దిపాటి నీరుగాని, శానిటైజర్‌గాని రిలీజ్ అయి, అక్కడ స్ప్రెడ్ అయి మళ్ళీ సక్షన్ వల్ల లోపలికి లాక్కోబడుతుంది. ఈ పద్ధతి వల్ల నీరు చాలా చాలా తక్కువ ఖర్చుకావడమేకాక, కుదుపుల వల్ల కమోడ్‌లోని నీరు బయటకు రాదు. ప్లేన్‌కి కుదుపులెందుకొస్తాయని కొందరికి సందేహం రావచ్చు. దానినే టర్బులెన్స్ అంటారు. బయటున్న విండ్స్ వలన ప్లేన్ బస్సులాగే కుదుపులకు గురి అవుతుంది.

ఆ తర్వాత ఫుడ్ సర్వ్ చేసారు. ప్లేన్‌లలో తిండి మనకు సరిపడే విధంగా ఉండదు. క్వాంటిటీ గురించికాదు. అదంతా తింటే కడుపు నిండిపోతుంది కానీ ఆ పదార్థాలన్నీ రుచికరంగా వుండవు. మనలా మసాలాలు, కారాలు, నూనెలతో వండినవి కావు. అందుకే ఆ ఫుడ్స్ వల్ల ఆరోగ్యం దెబ్బతినదు. నేను నాన్‌వెజ్, నా శ్రీమతి వెజ్ తీసుకున్నాం. నాకిచ్చిన ప్యాక్‌లో ఒక పెద్ద ఉడికించిన చికెన్‌ముక్క, దాంతోపాటు ఉడికించిన పెసరపప్పులాంటి ముద్ద ఉన్నాయి. అదేం కాంబినేషనో నాకర్థంకాలేదు. ఒక బన్, స్వీట్‌కార్న్‌తో సలాడ్, రసమలై స్వీట్, వెనిగార్ కలిపిన సాస్‌తో ఒక షాసే, సాల్ట్, పెపర్, స్పూన్‌లు, ఫోర్క్‌లు, ఫుడ్‌ప్యాక్‌లో వున్నాయి. సాస్ నాకస్సలు రుచించలేదు. సాల్ట్, పెపర్‌లతో చికెన్ కొంత తిని, స్వీట్‌కార్న్ సలాడ్, స్వీట్‌లతో కడుపు నింపుకున్నాను. వెజ్ పాక్‌లో చికెన్ బదులు రెండు వెజ్ కర్రీలు, బన్ బదులు రెండు రోటీలు పెట్టారు. మిగిలినవి కామనే. భోజనం చేసాక కాసేపు పడుకున్నాం. రెండు గంటల తర్వాత స్నేక్స్ అంటూ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Padamudu+Rojulu**

* * *